

"నమస్తే! నా పేరు భారతి. కమలా చిల్డ్రన్స్ హోంలో కొత్తగా పనిచెయ్యడానికి వచ్చిన టీచర్ని. జాయినింగ్ రిపోర్ట్ ఇప్పుడే ఇచ్చేయమంటారా?" కమలా ఎస్టేట్స్ జనరల్ మేనేజర్ని ప్రశ్నించాను.

సరే నన్నట్టు తలూపాడతను.

పది నిముషాల్లో ఆ తతంగం పూర్తి చేసి లేవబోతుంటే "మీకు క్వార్టర్ నెంబర్ ఫోర్టీన్ ఎలాట్ చేశా" నని చెప్పి క్వార్టర్ చూపించటంకోసం నాతో ఆయాని పంపించాడతను.

విశాలమైన ఆ కమలా నివాస్ భవంతి నుంచి బయటపడి సంరక్షణ లేక ఎండిపోతున్న ఆవరణలోని తోటని చూస్తే ఎందుకో బాధ అనిపించింది.

"ఇంత పెద్ద భవంతిలో ఈ తోటని సంరక్షించటానికి ఎవరూ మనుషులే లేరా! ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారేం?" ఆయాని ప్రశ్నించాను.

"ఆ తల్లి పోనాక బంగళాలోని మడుసుల బ్రతుకులే ఎండిపోతున్నాయి. ఆ దిక్కుమాలిన సచ్చినోడు శనివాగ ఆ యమ్మకి దాపరించినాడు. మడుసులికే దిక్కులేకపోతే మొక్కలకి రచ్చనేంటి, తల్లీ!" దురుసుగా చెప్పింది ఆయా.

అప్పుడు పరీక్షగా చూశా నావిడ్ని.

పల్లెటూరి స్త్రీ. తెల్లని దుస్తులు. నుదుట బొట్టులేదు. తైల సంస్కారం లేని జుట్టు ముడివేసుకుంది. ఆవిడ కళ్ళు గాజు కళ్ళలా నిస్తేజంగా మెరుస్తున్నాయి.

ఆవిడ మొహంలోకి సూటిగా చూశాను. ఆయా బరువుగా నిట్టూర్చింది. క్షణంసేపాగి చెప్పటం ప్రారంభించింది.

# అమ్మ

యెలిశెట్టి శంకరరావు

"మహేశ్వరం బాబు గారి పూర్వీకులు జమీందార్లనమ్మా. ఆ తర తాళ్ళందరూ ఆ బాబు కొగ్గేసిన జాగీరు కమలాపురం. దొర్లిపోయిన రోజులతోపాటు జాగీర్లు కొట్టుకుపోతే అయిశ్వర్య వొంతుడయిన మహేశ్వరం బాబు మిగిల్నాడు. ఆ బాబుకి ఒక్కగానొక్క సంతానం కమలమ్మ. మా తల్లి ఏ లోకానున్నాదో గాని బంగారబ్బొమ్మనా గుండేది. ఆ తల్లి మనసు ఎన్న. సిన్న వయసులోనే పట్నంల సదువులన్నీ పూర్తిసేసు కొచ్చేసినాది. ఈ వూరి రూపు రేకలన్నీ మార్చేసినాది. మడుసులికి, పశువులకీ ఆస్పటల్లు కట్టించినాది. పేదోల్లందరికీ భూములన్నీ పంచీసినాది. పిల్లలకోసరమని ఇస్కూలు పెట్టించినాది. ఇయ్యాల ఈ వూర్లో ఏ ఇల్లో ఆ సల్లని తల్లి పేరు సెప్పుకోకుండా దీపం ఎలిగించరమ్మా."

8—9—82

ఆ యమ్మ ఈ వూరందరికీ అమ్మే!

ఆ తల్లి పెళ్లి సమయంలో మాత్రం తప్పటడుగు ఏస్పినాది. పెద్దాయన పెద్ద సంబంధాలు ఎతుకుతుంటే తోటమాలి రాజయ్యగోడి కొడుకు సెంద్రం గోడి వల్లో పడిపోయి ఆడ్నే సేసుకుంటా నని పట్టుపట్టినాది. మహేశం బాబు ఆ యమ్మ మాట కాదన్లేక ఒప్పేసువ్నారు. అదేనమ్మ! అప్పట్నుంచే ఆ యమ్మ బతుకులో ఎన్నెల ఇగిరిపోయి సీకటి అలుముకు పోనాది. ఎంతోళ్ళకి అంత బుద్ది అని సెంద్రంగోడు ఆ యమ్మని కాల్సుకు తినేసే వోడు. ఆ డెన్ని బాదలు పెట్టినా, ఆ యమ్మ ఎప్పుడూ పన్నెత్తి ఎవరితోనూ కష్టం సెప్పుకునేది కాదు. తొలిసారి కాన్పులోనే ఆ యమ్మ సచ్చిపోనాది. ఆ సెంద్రంగాడే ఆ యమ్మని పంపేసేడేటో అంటా రమ్మా అందరూనూ. పాప పుణ్యాలు ఆభగమంతుడికే తెలియాల. మహేశంబాబు, ఆరి మనవడు దిక్కూ మాలినోళ్ళ లాగయిపోనరు. ఆ సెంద్రంగోడు పట్నంల సీట్ల పేకలకి, సాని ముండలకి ఆరి ఆస్తంతా ఎలిగించేస్తన్నాడు. మాలచ్మి కమలమ్మ పేరు ఆ ఎదవ ఒక్కసారైనా కనీసం తల్సుకోడు. అసా సెడవని సేమించి ఆ యమ్మ ఎంత తప్పు సేస్పినాదో, మంచం పట్టేసిన మహేశం బాబు మనసులోని పోయిన కూతురి మీద బెంగ ఆడ్ని కొట్టదా ...''

అర్థం అయ్యీ కానట్టున్న ఆయా మాటలు వింటూ ఆలోచనల్లోనే నా క్వార్టర్ చేరుకున్నాను.


• •

కొద్ది రోజుల్లోనే కమలాపురం పరిసరప్రాంతాలు, నేను పనిచేసే స్కూలు నన్ను బాగా ఆకట్టుకున్నాయి.

గంభీరంగా ప్రవహించే నది ఒడ్డునుంచి రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తేగాని కమలా చిల్డ్రన్స్ హోమ్ రాదు. నదికి ఆవలి ఒడ్డున ఎత్తైన కొండలు, ఈవలి ఒడ్డున దట్టంగా పెరిగిన పచ్చని తోటల సముదాయం. కొంతమేర కొబ్బరితోటలు, మామిడితోపు, దూరంగా పచ్చిక బయుళ్ళు, పైన్ చెట్ల వరుసలు, ఎత్తైన టేకు చెట్ల మధ్య నుంచి నడుస్తుంటే నదిపై నుంచి తేలివచ్చి శరీరాన్ని స్పృశించే పిల్లగాలి, లేత గున్న మామిడి చిగుళ్ళు తింటూ కోయిలమ్మ పాడి వినిపించే సంగీతం, అడవి పిట్టల అరుపులు వింటూ నెమ్మదిగా అడుగులు వేస్తూ స్కూలుకు చేరుకోవటం నా కో తియ్యని అనుభవం — ప్రతిరోజూ!

మొదటి రోజు హెడ్‌మిస్ట్రెస్ మాలతి గారు చెప్పిన మాటలు కమలాదేవిపట్ల నా హృదయంలో ఉన్న స్థానాన్ని ద్విగుణీకృతం చేశాయి.

"పసివాళ్ళ మనస్తత్వాన్ని పరిశీలించి చూస్తూ, వాళ్ళ వాళ్ళ పరిస్థితుల్ని అవసరాన్ని గమనిస్తూ— ఏ మిషన్ ఇంకే విధమైన పరిస్థితి వాళ్ళ చదువుల పట్ల శ్రద్ధని డామినేట్ చేసేదిగా ఉండకుండా కనిపెట్టి పసివాళ్ళ భవిష్యత్తును అందంగా తీర్చి దిద్దండి, టీచర్! ఇది ఈ స్కూలు స్థాపించిన కమలాదేవి కోరిక. ఇంప్లిమెంట్ చెయ్యాల్సిన బాధ్యత మనందరి మీదా ఉంది ... మీ క్లాసులో పదిమంది కంటే ఎక్కువ మంది పిల్లలుండరు. ఒక్కొక్కరినే ప్రత్యేకంగా అబ్జర్వ్ చేస్తూ అందరిపట్ల ఒకే రకమయిన శ్రద్ధ తీసుకుని పని చెయ్యండి. ఎవరికైనా మీరు ఆర్థికంగా సహాయపడా లనుకుంటే నాతో చెప్పండి. కమలా చిల్డ్రన్ ఫండ్‌నుంచి విత్‌డ్రా చేసి మీ కిస్తాను. గుడ్ లక్!'' చెప్పేసి వెళ్ళిపోయారు హెడ్‌మిస్ట్రెస్.




మొదటిరోజు పిల్లలందరి పేర్లు తెలుసుకుని, వాళ్ళ స్టాండర్డు తెలుసుకోవటానికి ప్రశ్నలు వేశాను. పిల్లలందరూ చురుగ్గానే ఉన్నారు. అడిగిన ప్రశ్నలన్నింటికీ చకచకా సమాధానాలు చెప్తున్నారు. వాళ్ళని ప్రశ్నిస్తుండగానే —

''మే ఐ కమిన్, టీచర్?'' సన్నగా స్వరం వినిపించి గుమ్మం వైపు చూశాను.

బిక్కుబిక్కుమంటూ బెదురుచూపులు చూస్తూ నిలబడ్డాడు ఆరేళ్ళ అబ్బాయి. తొడుక్కున్న ఖరీదైన నిక్కరు, చొక్కా బాగా మాసిపోయి ఉన్నాయి. జుట్టంతా చెదిరిపోయి ఉంది. నీలిరంగు కళ్ళు భయం భయంగా, అమాయకంగా చూస్తూ జాలి కొలిపేటట్లున్నాయి. జారిపోతున్న నిక్కర్ని పైకి ఎగలాక్కుంటూ, పుస్తకాల సంచీని చేత్తో పట్టుతున్నాడు.

లోపలికి రమ్మన్నాను.

వచ్చి బల్లమీద కూర్చున్నాడు.

''నీ పేరు?'' అడిగాను.

''శ్రీకాంత్!''

''ఎందు కింత ఆలస్యమయింది?''

''మరి! మరి! మరేమో అమ్మ కథ చెప్పింది. వింటూ ఉండిపోయాను.''

బెరుగ్గా చెప్పిన వాడి ముద్దుమాటలు వింటుంటే నాకు నవ్వు వచ్చింది. ''ఇంత ఉదయాన్నే కథలు చెప్తారా మీ అమ్మగారు?''

''మరే...టీచర్! నేను అడిగితే ఎప్పుడయినా చెప్తారు.'' కళ్ళు చక్రాల్లా తిప్పుతూ చెప్పాడు శ్రీకాంత్.

''సరే! ఇంకెప్పుడూ అమ్మగార్ని ఉదయం పూట కథలు చెప్పమనకు. ఏం?''

సరేనన్నట్టు తలూపాడు శ్రీకాంత్.

• • • •

రెండో రోజు క్లాసుకు రాగానే శ్రీకాంత్‌కోసం వెదికాను. క్లాసులో లేడు. మిగతా పిల్లల్ని అడిగితే ఇంకా రాలేదన్నారు. పాఠం చెప్పటంలో మునిగిపోయాను. అరగంట గడిచాక ముద్దు మాటలు వినిపించాయి.

''మే ఐ కమిన్, టీచర్!''

''ఇవా ళెందుకు ఆలస్యమైంది?''

''అక్కడ బోల్డు మామిడి పళ్ళున్నాయి, టీచర్! అమ్మ నడిగితే తిడుతుందేమోనని, అమ్మ చూడకుండా కాచుక్కూచుని నేను నాలుగు తీసుకుని తిని మీ క్కూడా కొన్ని తెచ్చాను.'' సంచీలోంచి మామిడిపళ్ళు తీసి నా కందించాడు.

నాకు నవ్వు వచ్చింది. బహుశా ఇంట్లో కూడా ఇలాంటి చిలక పలుకులు పలుకుతూ కూర్చుంటాడు కామోసు. అందుకే వాళ్ళమ్మగారు వీడ్ని వదల్డానికి ఇష్టపడరేమో!

''సరే! సరే! మామిడిపళ్ళు తిన్నా, ఏం తిన్నా స్కూలుకుమాత్రం తొందరగా వచ్చేసెయ్యాలి ఏం?''

సరేనన్నట్టు తలూపాడు శ్రీకాంత్.

• • • •

రోజులు గడుస్తున్నాయి. నేను చదువుతున్న ఎడ్యుకేషనల్ సైకాలజీ అంతా అప్లయి చేసి పిల్లలకి పాఠాలు చెప్పసాగాను.

పిల్లలందరూ శ్రద్ధగానే చదువుకుంటున్నారు— ఒక్క శ్రీకాంత్ తప్ప!

ఎన్నిసార్లు హెచ్చరించినా, రోజూ ఆలస్యంగానే వచ్చేవాడు. అమ్మతో మాట్లాడుతూ ఉండిపోయాననో, అమ్మ కోప్పడి తనతో మాట్లాడకపోతే బ్రతిమాలుతూ ఉండిపోయాననో కబుర్లు చెప్పేవాడు. రోజూ చెప్పే కారణం అమ్మే! తల్లితో శ్రీకాంత్ సాన్నిహిత్యానికి నేను జెలసీ ఫీలయ్యేదాన్ని. ఎందుకంటే నేను చిన్నప్పుడే అమ్మను పోగొట్టుకున్న నిర్భాగ్యురాల్ని.

ఒక రోజు ఏకంగా తడిబట్టలతో స్కూలుకి వచ్చాడు. కథ మొదలు పెట్టాడు. ''అమ్మా, నేను నది ఒడ్డులో షికారు కెళ్ళాం, టీచర్! అమ్మేమో నన్ను స్నానం చెయ్యమంది. చేశాక బట్టలుమార్చుకో మంది. మరి స్కూలుకు టయిమయిపోతుందని, నేను మార్చుకోకుండానే పరిగెట్టుకు వచ్చేశా!''

''ఉద్ధరించావ్!'' గట్టిగా కసిరి చాలా కోప

పడ్డాను ఆ రోజు శ్రీకాంత్‌ని.

ఆ రోజు మొదలు కొంచెం పెందరాలే వచ్చేస్తుండేవాడు. అయినా శ్రీకాంత్‌లో నే నొకటి గమనించాను. వాడు నేను చెప్పే పాఠాలు వినడం లేదు. నేను మందలిస్తే వింటున్నట్టు నటించేవా డంతే! వాడిలో స్కిజో ఫ్రెనియాల్ (తనచుట్టూ ఉన్న పరిస్థితుల్ని వాస్తవాన్ని మర్చిపోయి ఎక్కడో వూహాలోకాల్లో విహరిస్తూ తాను తాను కానని మరెవరో అన్నట్టు ప్రవర్తించేవాళ్ళని స్కిజో ఫ్రెనియాల్ అంటారు. ఇవి చిన్నపిల్లల్లో గమనించటం కష్టం. ఈ లక్షణాలు వాళ్ళలో డెవలప్ అయితే భవిష్యత్‌లో చాలా కష్ట పడతారు. ముఖ్యంగా ప్రాక్టికల్‌గా బ్రతకలేరు ఈ ఆధునిక ప్రపంచంలో — రచయిత) లక్షణాలు మొదలవుతున్నాయా? నాలో ఆందోళన మొద లయ్యింది.

ఆ రోజు ...

మామూలుగా ఆలస్యంగా వచ్చాడు శ్రీకాంత్. బట్టలనిండా మురికి. చెదిరిపోయిన జుట్టుతో నా ముందు నిలబడ్డాడు. నాకు చిరాకేసింది.

"ఎందుకు ఆలస్యమయింది?" విసుగ్గా ప్రశ్నించాను.

"హోమ్ వర్క్ చెయ్యలేదు, టీచర్! అమ్మ చేసి పెడుతుందని వూరుకున్నాను. ఎంత బతిమాలినా అమ్మ చెయ్యలేదు!" భయంభయంగా చెప్పాడు శ్రీకాంత్.

"హోమ్ వర్క్ నువ్వు చెయ్యటానికి! మీ అమ్మ గారు చెయ్యటానికి కాదు. నువ్వెందుకు చెయ్య లేదు?" గదమాయించి అడిగాను.

శ్రీకాంత్ మాట్లాడలేదు. తల దించుకున్నాడు.

"మాట్లాడవేం?" కసిరాను.

"మరే...టీచర్! నాకు చెయ్యటం రాలేదు. శ్రీకాంత్ నీలి కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగు తున్నాయి. నాకు జాలివేసింది.

"అయినా మీ అమ్మగారు నిన్ను బాగా ముద్దు చేసి పాడుచేస్తున్నారు. ఇలా మొద్దబ్బాయివవుతావు. ఇంతకీ మీ అమ్మగా రెవరు?" ప్రశ్నించాను.

"మా అమ్మే, టీచర్!" వెక్కిళ్ళ మధ్య చెప్పాడు శ్రీకాంత్.

నాకు నవ్వు వచ్చింది.

"మీ అమ్మగారేలే! ఏం పేరూ అని?"

"అమ్మ!"

"అమ్మ కాదు! పేరుంటుంది. రేపడిగి చెప్పు. అలాగే హోంవర్కు కూడా నువ్వే చేసి తీసుకురా!"

"అలాగే—టీచర్!" అన్నాడు శ్రీకాంత్, బుగ్గల మీద జారుతున్న కన్నీళ్ళు చొక్కాతో తుడుచు కుంటూ.

• • • •

"టీచర్! హోమ్ వర్క్ నేనే చేసేసానండి." పుస్తకం అందించాడు శ్రీకాంత్. పుస్తకం అందు కుని పేజీ తిరగేసాను. మొదటి పేజీమీద 'కమల' అన్న అక్షరాలు అందంగా వ్రాశా రెవరో.

"కమ లెవరోయ్ నీ గాల్ ఫ్రెండా?" నవ్వుతూ అడిగాను.



—కె.ఐ.ఎ.ఖాన్

"అది మా అమ్మగారి పేరు, టీచర్!" నా మొహంలోకి చూసి చెప్పాడు శ్రీకాంత్.

నాకు ఆశ్చర్యం కలిగింది.

"కమలా... అంటే మీ నాన్నగా రెవరూ?" విస్మయంగా అడిగాను.

"చంద్రంబాబు" చెప్పాడు శ్రీ.

నా గుండె జల్లుమంది. ఆందోళనగా శ్రీకాంత్ అమాయకమైన మొహంలోకి చూస్తూ ఉండి పోయాను. ఆ పసివాడి కళ్ళు నిర్మలంగా ఉన్నాయి.

"మా అమ్మ పేరు బావుందా, టీచర్!" సూటిగా నా వైపే చూస్తూ అడిగాడు శ్రీకాంత్.

యాంత్రికంగా తలూపాను.

నా మనసును ఆలోచనలు తొలిచేస్తున్నాయి.

శ్రీకాంత్ రోజూ చెప్తున్న అమ్మ ఎవరు?

• • • •

సాయంత్రం స్కూలు వదిలి పెట్టగానే నెమ్మ దిగా ఇంటిదారి పట్టాను. చల్లగా గాలి వీస్తోంది. శరీరం సేద దీరినట్లయినా, మనసుమాత్రం వికలం గానే ఉంది. శ్రీకాంత్ తల్లి గురించి పదే పదే చెప్పాడు. కమలాదేవి శ్రీకాంత్‌ని ప్రసవించేటప్పుడే చనిపోయింది అంటే కమలాదేవి చనిపోతే చంద్రం బాబు మరో స్త్రీని పెళ్ళి చేసుకున్నాడా? అతను వ్యసనపరుడని తెలిసీ ఎవ రిచ్చారు పిల్లని? చంద్రం బాబు లాంటి స్త్రీలోలుడు మరో అమ్మాయిని చేసుకుని సవ్యంగా వైవాహిక జీవితం గడుపుతున్నాడా? అయితే ఆ అమ్మాయి శ్రీకాంత్‌ని అంత ప్రేమగా ఆదరిస్తోందా? ఆ అమ్మాయి పేరు కూడా కమలేనా?

ఆలోచనలు చిందర వందరగా...!

అప్పుడు చూశాను శ్రీకాంత్‌ని, నా కొంచెం ముందు వడి వడిగా నడుస్తున్నాడు. పుస్తకాల సంచీ రెండు బుజాలకీ తగిలించుకుని వీపుమీద వేళ్ళాడేసుకున్నాడు.

హఠాత్తుగా నా కో ఆలోచన వచ్చింది. "ఈ రోజు చంద్రంబాబుని కలుసుకుని శ్రీకాంత్ గురించి మాట్లాడాలి. వాడి గురించి ఆయ నెందుకు శ్రద్ధ తీసుకోవటం లేదో అడగాలి?" ఈ నిర్ణయానికి రాగానే నడక జోరు హెచ్చించాను. శ్రీకాంత్‌కూ, నాకూ మధ్య దూరం తగ్గింది.

హఠాత్తుగా శ్రీకాంత్ కమలా ఎస్టేట్ వైపు కాకుండా కుడి వైపు పరుగుడు తోట మధ్యనుంచి సన్నని కాలిబాట పట్టాడు. నేను ఆశ్చర్యంతో వాడ్ని అనుసరించాను. పైన ఆకాశంలో నల్లని మేఘాలు కమ్ముకొస్తున్నాయి. పక్షులు గోల గోలగా అరుస్తూ గూళ్ళు చేరుకుంటున్నాయి. వడి వడిగా తుప్పల్ని దాటుకుంటూ నడుస్తున్నాడు శ్రీకాంత్. కీచురాళ్ళ రొద కోన పాడే సంగీతం భీతి కలిగిస్తోంది. శ్రీకాంత్ కనీసం వెనక్కి తిరిగి చూడకుండా నడుస్తున్నాడు. అంత నిర్భయంగా ముందుకుపోతున్న ఆ పసివాడిని చూస్తే నాకు భయం వేసింది. ఎగ్జార్సిస్ట్, ఒమెన్‌ల విషయ పరిజ్ఞాన ప్రభావం నాలో భీతి, ఉత్కంఠ తలెత్తిస్తున్నాయి. పైన ఆకాశం ఉండి ఉండి ఉరుముతోంది. నా నుదుట స్వేద బిందువులు అలుముకున్నాయి.

చాలాసేపు నడిచి మెలికలు తిరుగుతూ పారుతున్న సెలయేటి నానుకుని ఉన్న పచ్చిక బయలు మధ్య ఆగాడు శ్రీకాంత్. అక్కడ ... గున్నమామిడి చెట్టు నీడలో పాలరాతి సమాధిపైన అందంగా అక్షరాలు.

కమలాదేవి!

| జననం | మరణం |
|---|---|
| 31—3—1958 | 5—10—1981 |

శ్రీకాంత్ పచ్చని పసరిక మీద కూర్చుని సమాధి పైన చేతులు తల ఆన్చి మాట్లాడుతున్నాడు.

"అమ్మోయ్! ఈ రోజు టీచర్‌కి నీ పేరు చెప్పాను. బావుందన్నారు!"

నిశ్శబ్దం వచ్చింది.

"అమ్మా! నా కాకలేస్తోంది!" మామిడిచెట్టు మీద నుంచి సమాధిపైన రాలిన పళ్ళ వంక కలియజూస్తూ అన్నాడు శ్రీకాంత్. నది నవ్వుతూ ముందుకు సాగిపోతూంది.

నెమ్మదిగా చేతులు ముందుకు చాచి రెండు పళ్ళు తీసుకునితింటూ—"మమ్మీ! నా కీ రోజు ఏదైనా కథ చెప్పవూ?" జాలిగా అడుగుతున్నాడు శ్రీకాంత్

గాలి విసురుగా వీచి శరీరాన్ని జలదరింపజేసింది.

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చటుక్కున ముందుకు వెళ్ళి వాడ్ని ఎత్తుకుని నా హృదయానికి హత్తుకున్నాను. శ్రీకాంత్ నా మెడ చుట్టూ చేతులు వేసి విస్మయంగా నా కళ్ళల్లోకి చూస్తున్నాడు.

"ఎవరు చెప్పారు నీకు అమ్మ ఇక్కడుందని?" హీనస్వరంతో ప్రశ్నించాను.

"మరే! మరే! బోల్డు రోజుల క్రిందట అమ్మేదని తాతయ్య నడిగా, టీచర్! అమ్మ దేవుడి దగ్గరి కెళిపోయిందని చెప్పాడు. నే నేమో అన్నం తినకుండా ఏడిచాను. అప్పుడు తాతయ్యే నాకు అమ్మిక్కడుందని చూపించాడు."

సన్నగా వాన మొదలయ్యింది. హఠాత్తుగా నా చేతుల్లోంచిజారి—"మరి నేను వెళిపోతాను, టీచర్! ఆలస్యమయితే తాతయ్య తిడతాడు. నాన్న ఇంటిదగ్గ రుంటే కొడతాడు కూడా!" చెప్పి వడివడిగా కమలా నివాస్ వైపు పారిపోతున్నాడు శ్రీకాంత్.

'దేవుడూ! నీ ఉనికే గనక నిజమయితే, మానవ జీవితంలో తక్కువ ఆనందాన్ని, ఎక్కువ విషాదాన్ని నింపటం నీకు వినోదమయితే నువ్వో పెద్ద శాడి స్టువి!' ఒంటరిగా మిగిలిపోయిన నేను నాలో నేనే గొణుక్కున్నాను. ★